ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 1 జనవరి 2024 | 5





ముమ్మిడివరానికి చెందిన హెల్దీ లైఫ్ జిమ్ కోచ్ వాసంశెట్టి నరేష్ నూతనంగా పండిన ధాన్యం కంకులు, పోకచెట్టు ఆకు బెరడుతో తయారుచేసిన గ్రీటింగ్‌తో ఇలా శుభాకాంక్షలు తెలిపారు.



కొత్త ఆశలతో నూతన సంవత్సరానికి స్వాగతం

- ఆత్మీయతను చూపేందుకు సిద్ధమైన పూల బొకేలు
- అందుబాటులో అధికారులు, ప్రజాప్రతినిధులు
- కిటకిటలాడుతున్న బేకరీలు, స్వీట్‌స్టాల్స్
- మందు.. విందు.. చిందులతో 2023కు వీడ్కోలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

కొంగొత్త ఆశలతో కొత్త సంవత్సరానికి వివిధ రూపాల్లో స్వాగతం పలికేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాసులు సన్నద్ధమయ్యారు. 2024 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పుష్పగుచ్ఛాలు, పూలదండలు, స్వీట్లు, మిఠాయిలు, కేక్‌లు, చాక్లెట్లు, పండ్లు వంటి వాటిని అందించనున్నారు. అమలాపురం కేంద్రంగా ఆవిర్భవించిన కోనసీమ జిల్లాలో రెండో ఏడాది న్యూ ఇయర్ వేడుకలను వినూత్న తరహాలో జరుపుకుంటున్నారు. ముఖ్యంగా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు జిల్లా నలుమూలల నుంచి అధికారులు, అనధికారులు భారీగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలపనుండ డంతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. ఇప్పటికే పుష్పగుచ్ఛాలు, పండ్లు, స్వీట్లు, కేక్‌ల ధరలను భారీగా పెంచేశారు. ఆదివారం రాత్రి నుంచే పట్టణ వీధులు ప్రజలతో కిక్కిరిసిపోయాయి. 2023కు వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు. మందు, విందు, వినోదాలతో వేడుకలు జరుపుకుంటున్నారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ ఎస్.శ్రీధర్, డీఎస్పీ అంబికాప్రసాద్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపట్టారు.

న్యూ ఇయర్ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రమైన అమలాపురంలో ప్రజాప్రతినిధులు, అధికారులు అందుబాటులో ఉంటారు. రామచంద్రపురంలోని ఆయన నూతన స్వగృహంలో సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, అమలాపురం రూరల్ భట్నవిల్లిలోని ఆయన స్వగృహంలో రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ప్రజలకు అందుబాటులో ఉంటారు. అమలాపురం ఎంపీ చింతా అనురాధ అల్లవరం మండలం తుమ్మలపల్లిలోను, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ హసన్‌బాద్‌లోని స్వగృహంలో అభిమానులకు అందుబాటులో ఉంటారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా కొంకాపల్లిలోని క్యాంపు కార్యాలయంలోను, ఎస్పీ ఎస్.శ్రీధర్ క్యాంపు, ఆఫీసుల్లో ఉంటారు. పీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజు అమలాపురంలోని ఆయన స్వగృహంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, రాపాక వరప్రసాదరావు, కొండేటి చిట్టిబాబు, వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, యిళ్ల వెంకటేశ్వరరావు ప్రజలకు అందుబాటులో ఉంటారు.

2024కు కొత్త ఆశలతో స్వాగతం

కలెక్టర్ హిమాన్షు శుక్లా



నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను. విద్యార్థులు చదువుతో పాటు శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత పెంపొందించుకోవాలి. క్రీడ, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబరుస్తూ జిల్లాకు రాష్ట్రస్థాయిలో విశిష్ట గుర్తింపు లభించేలా కృషి చేయాలి. కొత్త సంవత్సరంలో రెట్టించిన ఉత్సాహంతో సంక్షేమ, అభివృద్ధి పథకాలను మరింత పటిష్టంగా అమలు చేసి జిల్లాను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రజలంతా పూర్తి సహాయ సహకారాలు అందించాలి.

అమృత్ భారత్ రైలుకు స్వాగతం

- సామర్లకోట, రాజమహేంద్రవరంలో ఆగిన రైలు
- లోకో పైలట్‌లకు సత్కారం



సామర్లకోటలో రైలుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

సామర్లకోట, డిసెంబరు 31: పశ్చిమబంగాలోని మాల్దా టౌన్ నుంచి బెంగళూరు వెళ్లే అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సోమవారం ట్రైయల్ రన్‌లో భాగంగా వివిధ స్టేషన్లలో ఆగింది. రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని స్టేషన్లలో ఆదివారం రైలుకు పలువురు నాయకులు, అధికారులు స్వాగతం పలికారు. సామర్లకోటలో పలువురు బీజేపీ నాయకులు, రైల్వే అధికారుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో లోకో పైలట్‌లకు శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సామర్లకోట నుంచి రైలు రాజమండ్రి వైపునకు వెళ్లేందుకు పచ్చ జెండాలు ఊపడంతో అమృత్‌భారత్ రైలు సామర్లకోట నుంచి బయలుదేరి వెళ్లింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు యార్లగడ్డ దశరథ రామారావు, రావుల మాధవరావు, యెనిమిరెడ్డి మాలకొండయ్య, ఫైడా వెంకటనారాయణ, సుంకవిల్లి బాపిరాజు, తుమ్మల పద్మజ, రైల్వే అధికారులు శివప్రసాద్, రవికాంత్, సంతోష్‌కుమార్, రామకృష్ణ, లోవరాజు, కెవీవీ రావు, వర్మ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

రాజమహేంద్రవరంలో ఘన స్వాగతం

రాజమహేంద్రవరం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మాల్దా నుంచి బెంగళూరు వరకూ నూతనంగా వేసిన 'అమృత్ భారత్' సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు రాజమండ్రి రైల్వే స్టేషన్‌కు ఆదివారం సాయంత్రం 6.10 గంటలకు చేరుకుంది. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, ఎంపీ భరత్‌రామ్, రైల్వే అధికారులు స్వాగతం పలికారు. విజయవాడ స్కూలు విద్యార్థులు తయారు చేసిన అమృత్ భారత్ రైలు నమూనా, రైల్వే స్కౌట్ విద్యార్థులు జాతీయ పతాకాలతో ఆకట్టుకున్నారు. రైలు లోపల, బయటా ఆకర్షణీయమైన రంగులు వేశారు. స్లీపర్ బోగీల్లోని టాయిలెట్లలో ఏసీ బోగీల్లో మాదిరి ఏర్పాట్లు చేశారు. ఫైర్ అలార్మింగ్ వంటివి ఉన్నాయి. పుష్ పుల్ టెక్నాలజీతో 6వేల హెచ్‌పీ సామర్థ్యం కలిగిన రెండు వ్యాప్-5 అత్యాధునిక ఇంజన్లు, స్లీపర్, జనరల్ తరగతి బోగీలతో గంటకు గరిష్ఠంగా 130 కిలోమీటర్ల స్పీడుతో అమృత్ భారత్ పరుగులు పెడుతుంది. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, జీఆర్పీ సీఐ విజయ్ శంకర్, టూటౌన్ సీఐ గణేశ్ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కురగంటి సతీశ్, బొమ్మల దత్తు, హారిక, యానాపు ఏసు, ఇన్‌చార్జి ఎస్ఎస్ శ్రీనివాస్, సీటీఐ చంద్రమౌళి, సీసీఐ కళ్యాణ్, ఏడీఈఎన్ గణేషన్, ఐవోడబ్ల్యు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి అమృత్ భారత్ రైలు రాకపోకలు

సామర్లకోట, డిసెంబరు 31: పశ్చిమబంగాలోని మాల్దా టౌన్-ఎస్ఎంవీటీ బెంగళూరు మధ్య నూతనంగా ప్రవేశపెట్టిన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ జనవరి 7 నుంచి రాకపోకలు ప్రారంభించనుంది. ఈ ఎక్స్‌ప్రెస్ రైలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయవాడ, గుంతకల్ రైల్వే డివిజన్ల పరిధిలో 11 ప్రధాన రైల్వే స్టేషన్లలో ఆగనుంది. సామర్లకోట, తుని రైల్వే స్టేషన్లతో పాటు రాజమండ్రి స్టేషన్ కూడా వాటిలో ఉంది. అలాగే ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట రైల్వేస్టేషన్లలో ఆగుతుంది. ఈ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు మాల్దా టౌన్ నుంచి ప్రతి ఆదివారం, బెంగళూరు నుంచి ప్రతి మంగళవారం ప్రయాణిస్తుంది. వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలుగా అత్యంత వేగవంతమైన, అనుకూలమైన, అత్యంత సౌకర్యవంతమైన ప్రయాణ రైలుగా రైల్వే ఉన్న తాధికారులు తెలిపారు. ఇది పూర్తిగా నాన్-ఏసీ రైలు. స్లీపర్ కోచ్‌లు, జనరల్ కోచ్‌లు ఉంటాయి. 13434 నంబరు గల మాల్దా టౌన్- ఎస్ఎంవీటీ బెంగళూరు రైలు మాల్దా టౌన్ నుంచి ఆదివారం ఉదయం 8.50 నిమిషాలకు బయలుదేరనుంది. ఈ రైలు తుని రైల్వే స్టేషన్‌కు సోమవారం ఉదయం 7.19కి చేరుకుని 7.20కి బయలుదేరుతుంది. సామర్లకోట స్టేషన్‌కు 7.54కి చేరుకుని తిరిగి 7.55కి బయలుదేరుతుంది. రాజమండ్రి స్టేషన్‌కు 8.34కు చేరుకుని తిరిగి 8.36కి చేరుతుంది. బెంగళూరుకు మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు వెళుతుంది. రైలు నంబరు 13433 ఎస్ఎంవీటీ బెంగళూరు-మాల్దా టౌన్ మధ్య ప్రతీ మంగళవారం మధ్యాహ్నం 1.50కి బయలుదేరుతుంది. బుధవారం తెల్లవారుజామున 4.18కి రాజమండ్రి చేరుకుని తిరిగి 4.20కి బయలుదేరుతుంది. సామర్లకోటకు ఉదయం 5.04 కి చేరుకుని తిరిగి 5.05 కి బయలు దేరుతుంది. తుని స్టేషన్‌కు ఉదయం 5.59కి చేరుకుని తిరిగి 6.00 బయలుదేరుతుంది. మాల్దా టౌన్‌కు గురువారం ఉదయం 11 గంటలకు చేరుతుంది. ఈ ఎక్స్‌ప్రెస్ రైలు జనవరి 9న మంగళవారం మధ్యాహ్నం 1.50కి బయలుదేరుతుంది.

ఉత్సాహంగా ఎడ్ల పందేలు



రంగంపేట, డిసెంబరు 31: తెలుగు సాంస్కృతిక వైభవానికి ఎడ్ల పందేలు చిహ్నమని, ఇటువంటి పోటీలను ప్రోత్సహించాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. రంగంపేట మండలం వడిశలేరులో ఆదివారం గన్ని భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎడ్ల పరుగు పోటీలనేవి మేలుజాతి పశువులను సంరక్షించడానికి మన పూర్వీకులు నుంచి వస్తున్న ఒక సంప్రదాయ పోటీలని తెలిపారు. 1600 మీటర్ల దూరం పరుగు పోటీల్లో సీనియర్ విభాగంలో గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరి(ప్రథమ), గొల్లప్రోలుకి చెందిన నిమ్మకాయల నూకరాజు, గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరి (ద్వితీయ), అనకాపల్లి జిల్లా నరసయ్యపేటకు చెందిన ముమ్మిన శివతేజ ఎడ్ల జతలు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. జూనియర్ విభాగంలో మండపేటకు చెందిన వేగుళ్ల రామస్వామి(ప్రథమ), కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్ శ్రీమణికంఠ(ద్వితీయ), వన్నెపూడికి చెందిన బవిరిశెట్టి మణి ఎడ్ల జతలు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా బహుమతి ప్రదానం చేశారు. సీనియర్ విభాగంలో ప్రథమ విజేతలకు బుల్లెట్ బైక్‌ను, మిగిలిన స్థానాల్లో నిలిచిన వారికి ఎలక్ట్రిక్ బైక్‌లను బహూకరించారు. ముఖ్య అతిథులను భాస్కరరావు సత్కరించారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఎమ్మెల్యేలు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్‌నారాయణ్, జనసేన నాయకుడు బత్తుల బలరామకృష్ణ, కె.బ్రహ్మాజీ, కొల్లాటి ఇజ్రాయిల్, పోతుల బుల్లి వీర్రాజు పాల్గొన్నారు.



విజేతకు బుల్లెట్ బండి బహూకరణ

తెలుగు మహాసభల ఏర్పాట్లు పరిశీలన

రాజానగరం, డిసెంబరు 31: గైట్ కళాశాల ప్రాంగణంలో జనవరి 5వ తేదీ నుంచి జరగనున్న అంతర్జాతీయ తెలుగు మహా సభలు నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లను రాజమహేంద్రవరం డీఎస్పీ డాక్టర్ ఎం.కిశోర్‌కుమార్, ప్రత్యేక విభాగం డీఎస్పీ రామవర్మ ఆదివారం పరిశీలించారు. అనంతరం చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కేవీవీ సత్యనారా యణరాజు (చైతన్యరాజు)తో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకూ చతుర్వేద మహాయాగంతో పాటు శ్రీవారి వైభవోత్సవం నిర్వహిస్తామన్నారు. అలాగే చైతన్య విద్యాసంస్థలు, ఆంధ్ర సారస్వత పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకూ అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాలకు ఐదు రాష్ట్రాల గవర్నర్లు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పీఠాధిపతులు ముఖ్య అతిథులుగా విచ్చేస్తారని చెప్పారు. రాజానగరం సీఐ పి.కాశీవిశ్వనాథ్, గైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తలుపులమ్మ లోవలో భక్తుల కిటకిట

తుని రూరల్, డిసెంబరు 31: ప్రముఖ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించడంతో మొక్కులు చెల్లించుకుంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో గల వసతి గదుల్లో వంటావార్పులు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో టి.విశ్వనాథరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా రూరల్ ఎస్ఐ విజయబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.

వాడపల్లి ఆలయానికి డీసీ హోదా

ఆత్రేయపురం, డిసెంబరు 31: ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలంగా భక్తుల ప్రగాఢ విశ్వాసం. కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవంగా బాసిల్లుతున్న శ్రీవారు ఉభయరాష్ట్రాలలో ఎంతగానో ఖ్యాతిని ఆర్జించారు. అంత ఖ్యాతిని ఆర్జించిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి డిప్యూటీ కమిషనర్ హోదా దక్కింది. రాష్ట్ర కేబినెట్‌తీర్మానం మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ వాడపల్లి వెంకన్న ఆలయానికి డీసీ హోదాను ఇస్తూ ఈ నెల 29న ఉత్తర్వులు జారీ చేశారు. స్వామివారి వార్షిక ఆదాయం రూ.13 కోట్లకు చేరడంతో ఈ హోదా దక్కింది. దేవదాయశాఖ డీసీ హోదాలో పాలన సాగనుంది. భక్తుల సౌకర్యాల కల్పనకు స్వయంగా నిర్ణయాలు తీసుకునే అధికారం ఉంటుంది. పరిపాలన సౌలభ్యం సులభతరం కానుంది. త్వరలోనే ప్రభుత్వ డిప్యూటీ కమిషనర్‌ను నియమించనుంది.

సర్వాంగ సుందరంగా వాడపల్లి ఆలయం



ఆత్రేయపురం,డిసెంబరు 31: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం నూతన సంవత్సర వేడుకలకు ముస్తాబైంది. సువాసనలు వెదజల్లే వివిధ రకాల ఫల పుష్పాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. పుష్పాలతో అలంకరించి 2024 భక్తులకు స్వాగతం పలుకుతున్నారు. ఓంకారం, శ్రీనివాసుని నామాలు, హనుమ, జై శ్రీరామ్ నినాదాలతో పుష్పాలంకరణ కనువిందు చేసింది. ఫొటోషూట్లను ఏర్పాటు చేస్తున్నారు. వాడవాడలా నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ముత్యాల ముగ్గులు వేశారు. వివిధ రాజకీయ పార్టీ నాయకులు నూతన సంవత్సర ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అనంతరం 2023కు వీడ్కోలు పలికారు.

పలు రైళ్లు రద్దు

సామర్లకోట, డిసెంబరు 31: విజయవాడ సమీపాన రైలు ట్రాక్‌పై రోలింగ్ కారిడార్ బ్లాక్ ప్రోగ్రాం, పలు భద్రతా ఏర్పాట్లలో భాగంగా జనవరి 1 నుంచి ఈ సెక్షన్‌లో ఉదయ్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లతో పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే సీనియర్ ఏటీఎం చార్జి ఏ.సురేష్‌రెడ్డి రైల్వే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 17239 నంబరు గల గుంటూరు-విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించే సింహాద్రి ఎక్స్‌ప్రెస్ జనవరి 1 నుంచి జనవరి 14 వరకూ రద్దు చేశారు. 17240 నంబరు గల విశాఖపట్నం-గుంటూరు మధ్య రాక పోకలు సాగించే సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు జనవరి 1 నుంచి 15 వరకూ రద్దు చేశారు. 22701 నంబరు గల విశాఖ- విజయవాడ మధ్య రాకపోకలు సాగించే ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైలు జనవరి 1,2,3,5,6,8,9,10,12,13 తేదీలలో రద్దు చేశారు. 22702 నంబరు గల విజయవాడ-విశాఖ మధ్య రాకపోకలు సాగించే ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైలు జనవరి 1,2,3,5,6,8,9,10,12,13 తేదీలలో రద్దు చేశారు.

హైకోర్టు న్యాయమూర్తి పూజలు

అన్నవరం, డిసెంబరు 31: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాదరావు కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయనకు ఆలయ పీఆర్వో డీవీఎస్ కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందించగా అధికారులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఆర్వో ఎం.గణపతిరావు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కరప్రసాద్ తదితరులున్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

అంబాజీపేట, డిసెంబరు 31: ఈనెల 29, 30 తేదీల్లో విజయవాడ ఏపీఎస్‌ఆర్‌ఎంసీ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు హాజరైన అంబాజీపేట విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జూనియర్ బాలుర విభాగంలో డి.విజయరాఘవేంద్ర మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. సీనియర్ బాలికల విభాగంలో కె.వైష్ణవి, బీహెచ్‌ఎల్ సౌమ్య (కొరిగి) గోల్డ్‌మెడల్స్, పి.భార్గవిశ్రీకళ, వైవైష్ణవి గోల్డ్‌మెడల్స్ సాధించారు. జనవరిలో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను పాఠశాలలో అభినందించారు.

కడియం పూల మార్కెట్‌కు కళ

కడియం, డిసెంబరు 31: నూతన సంవత్సర ఆరంభంతో అంతర్జాతీయ పూల మార్కెట్‌కు కళ ఏర్పడింది. అటు పూల వర్తకులు, ఇటు కొనుగోలు దారులు, మరోపక్క పూల రైతులతో మార్కెట్ సందడిగా మారింది. రెండు రోజుల నుంచే రాష్ట్రం నలుమూలలకు పూలు ఎగుమతి అవుతున్నాయి. అయితే ఆదివారం మార్కెట్ మరింత బిజీగా మారింది. ప్రజలు ఇంటి అలంకరణ, దేవుని అలంకరణ, పూజకు పూల దండలు, పువ్వులు కొనుగోలు చేశారు. అలానే ప్రజాప్రతినిధులకు, రాజకీయ పార్టీల నాయకులు, ఉన్నతాధికారులకు, అధికారులకు కిందిస్థాయి ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పటం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో పుష్పగుచ్ఛాలకు డిమాండ్ ఏర్పడింది. కడియం, కడియపులంక గ్రామాల్లో రెండు మూడు రోజుల నుంచి ఆర్కిడ్స్, జర్బెరా తదితర రకాల పూలతో రూ.300 నుంచి రూ.1,500 వరకు పుష్పగుచ్ఛాలు తయారు చేశామని తయారీదారులు చెబుతున్నారు. పూలమార్కెట్‌లో ధరలు ఇలా ఉన్నాయి. లిల్లీ (కిలో) రూ.100, కాగడాలు(కిలో) రూ.500, జాజులు(కిలో) రూ.1,200, పసుపు కుంకుమ, నీలం రకాల చామంతులు(కిలో) రూ.130 నుంచి రూ.80, వైట్ చామంతి (కిలో) రూ.130, స్టార్‌గులాబీ (కిలో) రూ.160, ఎల్లో, కలకత్తా రకాల బంతిపూలు రూ.50 నుంచి రూ.40, కనకంబరం(బారు-1) రూ.300, డచ్ (20పూలు) రూ.300 ధర పలుకుతున్నాయని పూల వర్తకులు తెలిపారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.లక్ష విరాళం

అయినవిల్లి, డిసెంబరు 31: రాజమహేంద్రవరానికి చెందిన కేవీపీ చంద్రశేఖర్‌శాస్త్రి ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవిఘ్నేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. దాతకు ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి అభినందించారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, డిసెంబరు 31: వాడపల్లిశ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన ఐనగడ్డ శ్రీరామరాజు - భాను దంపతులు రూ.1,01,116 విరాళం సమర్పించారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,45,672 లభించినట్టు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అమలాపురం రూరల్, డిసెంబరు 31: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని 58డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం భట్నవిల్లిలో క్యాంపు కార్యాలయం వద్ద మంత్రి పినిపే విశ్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులకు బకాయి పడ్డ అలవెన్సులను చెల్లించాలని, ఏప్రిల్ 2022 నుంచి ఉద్యోగులకు చెల్లించాల్సిన మంత్లీ ఇన్సెంటీవ్‌లు, ఇంక్రిమెంట్‌లు, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో జిల్లా కార్యదర్శి పందిరి రాంబాబు, డిపో కార్యదర్శి పితాని మణిరాజు, జోనల్‌సీవీపీ సుబ్బారావు, కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

3న కేంద్ర మంత్రుల రాక

అంతర్వేది, డిసెంబరు 31: అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బరుకు ఈనెల3న కేంద్ర మంత్రులు వస్తున్నట్టు మత్స్యశాఖ జేడీ ఆనందరావు ఆదివారం తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డ్స్, మత్స్యకారులకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు పర్యటన ఉంటుందని ఆయన తెలిపారు. అంతర్వేది పల్లిపాలెంలోని ఫిషింగ్ హార్బరును పరిశీలించి కేంద్ర మంత్రులు మత్స్యకారులతో మాట్లాడేందుకు, సమావేశ పరిచేందుకు సభా స్థలాన్ని పరిశీలించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏడీ వర్ధన్, ఎఫ్‌డీవో వెంకటరమణ, మత్స్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

మామిడికుదురు, డిసెంబరు 31: యూటీఎఫ్ క్యాలెండర్‌ను మామిడికుదురు విద్యా వనరుల కేంద్రం వద్ద ఆదివారం ఎంఈవోలు ఎస్వీవీవీఎస్ లక్ష్మీనారాయణ, ఎం.వెంకన్నబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాయుడు నాగేశ్వరరావు, జీఎస్ ప్రసాద్, బి.పెద్దిరాజు, జి.మురళీకృష్ణ, టీఆర్కే గణపతిరావు, ఎం.సత్యనారాయణ, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యానాం వెంకన్న ఆలయానికి చేరుకున్న నల్ల రాళ్లు



యానాం, డిసెంబరు 31: యానాం శ్రీభూసమేత వెంకటేశ్వరస్వార స్వామి ఆలయ పునఃనిర్మాణానికి సంబంధించి తమిళనాడులోని తిరుచ్చి నుంచి నల్ల రాళ్లు యానాం చేరుకున్నాయి. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో యానాం వెంకన్న ఆలయం నిర్మాణ పనులు టీటీడీ చేపడుతున్న విషయం తెలిసిందే. మొదటి దశలో రూ.6కోట్లతో పనులు ప్రారంభమయ్యాయి. రూ.2.7కోట్లు దాతలు సమకూర్చగా టీటీడీ రూ.3.30కోట్లు సమకూర్చింది. తమిళనాడు చెందిన కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నాడు. కొన్ని నెలలుగా తిరుచ్చిలో నల్లరాయి పనులు చేపట్టారు. 40టన్నుల నల్లరాళ్లు ఆదివారం ఉదయం ఆలయ ప్రాంగణానికి చేరుకున్నాయి. పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, ఆలయ ఈవో ఖండవిల్లి రామకృష్ణ, ఆలయ కమిటీ ప్రతినిధులు కాపగంటి ఉమాశంకర్, మొలగజ్జెల ఆనందరావు, గుత్తుల గోవిందజయ రామారావు, కొంకిపూడి గాంధీ, టీఎస్ రాజేశ్వరరావు, గూటం శివగణేష్, ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం నల్లరాయిలను ఆలయం ప్రాంగణంలో దించారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం,డిసెంబరు 31: అభివృద్ధి సంక్షమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. పులిదిండిలో ఆదివారం రూ.9లక్షలతో సొసైటీ వద్ద నిర్మించినషెడ్, రూ.5లక్షలతో నిర్మించిన కల్వర్టును ప్రారంభించారు. వెలిచేరు హైస్కూల్ 8వతరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఎంపీపీ కుండా అన్నపూర్ణ, జడ్పీటీసీ బోనం సాయిబాబా, అప్కాస్ డైరక్టర్ కప్పల శ్రీధర్, సొసైటీ అధ్యక్షుడు కనుమూరి శ్రీనివాసరాజు, పాలా నాగేశ్వరరావు, కొల్లిశ్యామ్‌సన్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి: వేగుళ్ల

కపిలేశ్వరపురం, డిసెంబరు 31: ప్రతీ ఒక్కరూ మేల్కొని వైసీపీ అరాచక ప్రభుత్వాన్ని గద్దెదించాలని, లేకుంటే రాష్ట్రంలో సామాన్యులు బతికే పరిస్థితి ఉండదని ఎమ్మెల్యే జోగేశ్వరరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ అన్నారు. ఆదివారం నల్లూరులో టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించిన బాబుష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో వారు మాట్లాడారు. టీడీపీ-జనసేన సంకీర్ణ ప్రభుత్వం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కుతో వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పి చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను గద్దెనెక్కించాలని కోరారు. జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ



మండపేట/ఉప్పలగుప్తం, డిసెంబరు 31: అంబేద్కర్ కోనసీమ జిల్లా రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా భీమనపల్లి శ్రీమల్లికా రైస్ ఇండస్ట్రీస్ అధినేత దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ నియమితులయ్యారు. ఆదివారం మండపేటలో జరిగిన కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు వేగుళ్ళ పట్టాభిరామయ్యచౌదరి ఆధ్వర్యంలో ఈనియామకం జరిగింది. గతంలో లక్ష్మీనారాయణ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా పనిచేశారు. రాష్ట్ర సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ చైర్మన్ ద్వారంపూడి భాస్కరరెడ్డి, రాష్ట్ర రైస్ మిల్లర్స్ సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి ఆయనను అభినందించారు. ఆయననుజిల్లాకు చెందిన రైస్‌మిల్లర్ల సంఘ నాయకులు అభినందించారు. జిల్లా ఉపాధ్యక్షుడు గణేశుల కొండలరావు, వెత్స సూర్యప్రకాష్, కోనగళ్ల సత్తిపండు, వైట్ల దుర్గారావు, ఎన్.వీ.వీఎస్.ఎస్. ఎన్.రెడ్డి, కర్రి నారాయణ రెడ్డి, సత్తి సత్తిరెడ్డి, నల్లమిల్లి వెంకటకృష్ణారెడ్డి, నల్లమిల్లి విజయబాస్కరరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మెకు ఆప్ నేతల మద్దతు

కొత్తపేట, డిసెంబరు 31: సమస్యల పరిష్కారం కోసం ఇరవై రోజులుగా వివిధ రూపాల్లో ధర్నాలు చేస్తున్న అంగన్‌వాడీలకు ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ మెర్ల శాస్త్రీలు ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శాస్త్రీలు మాట్లాడుతూ చర్చల పేరుతో చిరుద్యోగులను వంచన చేయకుండా వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మెర్ల శాస్త్రీలు ఆప్ సభ్యులు ఎం.సుజశ్రీ, శ్రీవాణి, బి.గాయత్రిదేవి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల గ్రామోత్సవం

ముమ్మిడివరం, డిసెంబరు 31: అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షింతలను ఆదివారం ముమ్మిడివరం మెయిన్‌రోడ్డులోని విష్ణాలయంలో విశేష పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వాములు కలశలను ధరంచి భక్తి శ్రద్ధలతో శ్రీరాముని తారక మంత్రం జపిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. జనవరి 1 నుంచి 5వరకు ప్రతీ ఇంటికి స్వామివారి చిత్రపటం, కరపత్రాలు, అక్షింతలను అందించే విధంగా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో గురుస్వామి పెన్మెత్స జగ్గప్పరాజు, హిందూసేన రాష్ట్ర అధ్యక్షుడు గొలకోటి వెంకటరెడ్డి, ప్రముఖ న్యాయవాది తటవర్తి నాగరాజారావు, సమరసతా సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ బొంతు కనకారావు, గొలకోటి సాయిబాబు, కొయ్యల దుర్గారావు, కోనే రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఐ క్యాలెండర్ ఆవిష్కరణ

అమలాపురం టౌన్, డిసెంబరు31: బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా శాఖఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. జిల్లా శాఖ అధ్యక్షుడు మట్టా సిద్ధార్థగౌతమ్ అధ్యక్షతన జరిగిన సభలో కేంద్ర కమిటీ కార్యదర్శి ఎస్ఎస్ ఆర్ భూపతి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్లి రాంబాబు, ఉపాధ్యక్షుడు మట్టా వెంకట్రావు, ఉపాసకులు సవేర, ఎస్ఎం రుషి, డీబీ లోక్, జీవీ రెడ్డి తదితరులు పాల్గొని బుద్ధిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం బుద్ధుని చారిత్రక ఘట్టాలను పొందుపరుస్తూ రూపొందించిన బీఎస్ఐ నూతన క్యాలెండర్‌ను భూపతి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉండ్రు శ్యామలరావు, ఈవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరుకు నిరసనగా వేడుకలకు దూరం: మల్లాడి

యానాం, డిసెంబరు 31: యానాం నియోజవర్గంలో రెండేళ్లుగా నిర్వహిస్తున్న పేకాట క్లబులను తనతో పాటు ప్రజలు ఆపడానికి ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికి ఇంకా ఆగలేదని దీనిపై ప్రభుత్వానికి నిరసన తెలపడం కోసం నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు వీడియో ద్వారా తన సందేశాన్ని పంపారు. సీఎం, గవర్నర్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శులకు పేకాట క్లబ్బులను తొలగించాలని స్వయంగా కలిసి వినతిపత్రాలు ఇచ్చామన్నారు. అయినా ఫలితం లేదన్నారు. 5462మంది మత్స్యకారులకు ఓఎన్జీసీ పరిహారం జనవరి 5న అంజేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అయితే ఒక వర్గం పెట్టిన అభ్యర్థనలతో 12రోజులుగా ఈఫైల్ ముందుకు కదలేదన్నారు. వీటిలో పాటు యానాంలో పెండింగ్ సమస్యలు పరిష్కారమయ్యే వరకు వ్యక్తిగతకార్యక్రమాలకు దూరంగా ఉంటానన్నారు.

నూతన సంవత్సర వేడుకలకు ఏర్పాట్లు

రావులపాలెం, డిసెంబరు 31: గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మహిళలు ఆదివారం రాత్రి ఇళ్ళ వాకిట్లో రంగవల్లులతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ రంగురంగుల ముగ్గులు వేశారు.

కోనసీమ జిల్లా స్థాయి గణిత దినోత్సవం

ముమ్మిడివరం, డిసెంబరు 31: రాష్ట్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో అయినాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా జిల్లా స్థాయి గణిత దినోత్సవం నిర్వహించారు. రంగవల్లుల శోభతో ప్రారంభమైన గణిత కార్యక్రమాలు గణిత రంగవల్లులు, గణిత క్విజ్, గణిత వైజ్ఞానిక ప్రదర్శన, గణిత టాలెంట్ టెస్ట్ వంటి వాటితో సాగింది. గణిత అవధాని, పాఠ్యగ్రంథ రచయిత పి.రవిశంకర్ నిర్వహించిన గణితావధానం విద్యార్థులను ఉర్రూతలూగించింది. మనం భయపడితే గణితం భయపెడుతుంది. గణితంతో చెలిమి చేస్తే అంకెలతో ఆనందం, సూత్రాలతో ఆహ్లాదం, సమస్యలతో క్రీడా స్ఫూర్తి కలుగుతాయని గణితావధాని నిరూపించారు. జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం మాట్లా డుతూ గణితం -విజ్ఞాన శాస్త్రాలది విడదీయలేని బంధమన్నారు. కార్యక్ర మంలో గాడిలంక హెచ్‌ఎం జి.ఉదయభాస్కర్, అయినాపురం హెచ్‌ఎం తాడి కృష్ణారెడ్డి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వీడీకే వరప్రసాద్, గణిత ఉపాధ్యాయులు ఆనందరావు, దుర్గారావు, రెడ్డిబాబు, అమరేశ్వరి, గెజిటెడ్ హెచ్‌ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి టీడీపీ కృషి

అంబాజీపేట, డిసెంబరు 31: పేదల అభ్యున్నతికి టీడీపీ కృషి చేస్తుందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి వీరవెంకట సత్యనారాయణ పేర్కొన్నారు. పుల్లేటికుర్రులో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి బాండ్లను పంచారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పబ్బినీడి రాంబాబు, దాసరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత యోగా ఆశ్రమం ప్రారంభం

పి.గన్నవరం, డిసెంబరు 31: కుందాలపల్లి శివారు పప్పులవారిపాలెం గ్రామసచివాలయం వద్ద శ్రీస్వామి వివేకానంద యోగా ఆశ్రమం గురువు యోగా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచిత యోగా ఆశ్రమాన్ని ప్రారంభించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. యోగాసనాలతో అన్ని వ్యాధులు దూరమవుతాయాన్నరు. కార్యక్రమంలో పప్పుల వెంకటకర్ణ, పప్పుల రాజా, సత్యప్రసాద్, శ్రీనివాస్, సురేష్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్రైన్ ఫీడ్ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం

మామిడికుదురు, డిసెంబరు 31: బ్రైన్ ఫీడ్ అవార్డు గ్రహీత, మామిడికుదురు దీప్తి కళాశాలల అధినేత డీవీవీ సత్యనారాయణకు ఆదివారం ఘన సన్మానం నిర్వహించారు. జాతీయస్థాయిలో ఇటీవలహైదరాబాద్‌లో జరి గిన కార్యక్రమంలో అవార్డును ఆయన అందుకున్నారు. విద్యాభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల గౌరవాధ్యక్షుడు ఆర్.గోపీనాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్వీ రమణారావు, కె.మురార్జీ, స్థానికులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి

ముమ్మిడివరం, డిసెంబరు 31: నగర పంచాయతీ ప్రజారోగ్య విభాగానికి సంబంధించి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు నిరవధిక సమ్మెలో పాల్గొన్నందున వ్యాపారస్తులు, ప్రజలు సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ జి.లోవరాజు విజ్ఞప్తి చేశారు. చెత్తను రోడ్లపై, డ్రైన్లలో వేయకుండా ప్రైవేటు వర్కర్లు, ట్రాక్టర్లకు అందించి సహకరించాలన్నారు. అత్యవసరమైతే 08856- 295266, 8897428585, 7842501328లను సంప్రదించాలన్నారు.

స్థానిక అభ్యర్థికే టిక్కెట్ కేటాయించాలి

మామిడికుదురు, డిసెంబరు 31: పి.గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ టిక్కెట్‌ను స్థానిక అభ్యర్థులకే కేటాయించాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ నాయకుల సమావేశం డిమాండు చేసింది. పాశర్లపూడిలో నియోజకవర్గ ఎమ్మెల్యే టిక్కెట్ ఆశావహుల, ముఖ్య నాయకుల సమావేశం ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చుట్టుగుళ్ల కిశోర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశంలో పలువురు మాట్లాడుతూ మాల, మాదిగ సామాజికవర్గాల నుంచి ఎవరొక స్థానిక అభ్యర్థికి టిక్కెట్ కేటాయించాలని కోరారు. నేదునూరి వీర్రాజు, కాకర శ్రీనివాస్, మోత వెంకటేశ్వరరావు, గోగి రమేష్, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, జాలెం సుబ్బారావు, బొండాడ నాగమణి, ఉండ్రు శ్రీరామారావు, పైడి బుజ్జి, చుట్టుగుళ్ల దుర్గాదేవి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

సంబరాలు

అల్లవరం, డిసెంబరు31: 2023 సంవత్సరానికి వీడ్కోలు, 2024 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. మద్యం, మాంసం దుకాణాల వద్ద బారులుతీరారు. ఆయా ఇళ్ల వద్ద మహిళలు ముత్యాల ముగ్గులు వేసేందుకు పోటీపడ్డారు. ముఖ్యకూడళ్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి యువత కేక్స్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

పేదల పెన్నిధి ప్రధాని మోదీ

మలికిపురం, డిసెంబరు 31: పేదల అభివృద్ధి, పేదరిక నిర్మూలనా లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా అన్నారు. ఆదివారం గూడపల్లి పల్లిపాలెం, పడమటిపాలెంలలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పి.నరసింహస్వామి, ఆకుల చినవెంకన్నా యుడు, మాలే శ్రీనివాస నగేష్, అడబాల రాంబాబు, కె.కనకేశ్వరరావు, ఎంపీడీవో ఎం.ముత్యంనాయుడు, మేడిచర్ల చాణక్య, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంతలో తళుక్కుమన్న చుక్క చేపలు



మలికిపురం, డిసెంబరు 31: మలికిపురంలో ఆదివారం సంత మార్కెట్‌లో అరుదుగా లభించే చుక్క చేపలు ప్రత్యక్షమయ్యాయి. మాంసాహార ప్రియులు వాటిని ఎగబడి కొనుగోలు చేశారు. కిలో రూ.300 వరకు ఈచేపలు ధర పలికాయి.

జనవరిలో రంగస్థల కళా ప్రదర్శనలు

అంతర్వేది, డిసెంబరు 31: జనవరి27,28 తేదీల్లో కళాకారుల ప్రోత్సాహం కోసం రంగస్థల కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు శ్రీశ్రీకళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. గోదావరి కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టేకిశెట్టిపాలెం విజేత స్కూలు ఆడిటోరియంలో ఉత్సవాలు జరపనున్నట్టు తెలిపారు. బ్రోచర్‌ను వీవీ మెరక గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ప్రతాప్ ఆవిష్కరించారు. గోదావరి కల్చరల్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు డాక్టర్ కొల్లాబత్తుల జామవా పాల్గొన్నారు.


పంచాయతీ నిధులను తక్షణమే విడుదల చేయాలి

రాజోలు, డిసెంబరు 31: దారి మళ్లించిన పంచాయతీ నిధులను తక్షణమే విడుదల చేయాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. తాటిపాకలో ఆదివారం జరిగిన సర్పంచ్‌లు, ఎంపీటీసీల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 3న మంగళగిరిలో జరగనున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీల నిరసన సమావేశంలో రాజోలు నియోజకవర్గ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా శ్రీను, సర్పంచ్‌లు చెల్లుబోయిన హెలీన, కడలి సత్యనారాయణ, యెనుముల నాగు, వైస్‌ఎంపీపీ కందికట్ల నిర్మల, ఎంపీటీసీలు బొడ్డు కృష్ణారావు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, కసుకుర్తి త్రినాథస్వామి, అడబాల చంటి, అడబాల సత్యరమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేశవస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు

ముమ్మిడివరం, డిసెంబరు 31: ముమ్మిడివరం నగర పంచాయతీలో శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం స్వామివారికి వేదపండితులు లక్షపత్రి పూజ, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. దేవస్థానం నూతన సంవత్సర క్యాలెండర్‌ను పెన్మెత్స చిట్టిరాజు ఆవిష్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ సురేష్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నసమారాదన జరిగింది.

జనసేనలో చేరిన ఆర్‌బీకే చైర్మన్ నరాల



కపిలేశ్వరపురం, డిసెంబరు 31: నల్లూరులో ఆదివారం ఆర్‌బీకే చైర్మన్, బూత్ మెంబరు నరాల వెంకట్రావు వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో ఆయన చేరారు. వెంకట్రావుకు లీలాకృష్ణ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

అర్ధనగ్న ప్రదర్శన



మండపేటలో కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ముమ్మిడివరం, డిసెంబరు 31: నగర పంచాయతీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి ఆరో రోజుకు చేరుకుంది. నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన దీక్షా శిబిరంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులంతా అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. శిబిరంలో ఎం.శ్రీనివాసరావు, ఎస్.అరుణ్‌కుమార్, ఎస్.అజయ్‌కుమార్, వి.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేష్, వై.రమణ, కాశి జార్జి, జి.రమేష్, ఎ.సత్తిబాబు, ఎస్.రామరాజు, కె.గోవిందరాజు పాల్గొన్నారు. అంగన్‌వాడీ హెల్పర్లు, వర్కర్లు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్‌లు శిబిరాన్ని సందర్శించి సంఘీభావాన్ని తెలిపారు.

మండపేట: మున్సిపల్ ఒప్పంద పారిశుధ్య కార్మికులు చేపట్టిన ఆదివారం ఆరో రోజుకు చేరింది. పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. ఆరు రోజుల నుంచి కార్మికులు సమ్మె చేపట్టడంతో పట్టణంలో చెత్తా, చెదారం పేరుకుపోయింది.

సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షలు

ముమ్మిడివరం, డిసెంబరు 31: సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 12 రోజుకు చేరుకుంది. శిబిరాన్ని ముమ్మిడివరం అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షుడు ఎస్.దుర్గామహేశ్వరి, కార్యదర్శి జయలక్ష్మి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల ఆయాలు, కార్యకర్తలు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. శిబిరంలో సీఆర్పీ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనుబాబు, జిల్లా కార్యదర్శి ఎస్.వెంకట్, ఎంఐఎస్ కోఆర్డినేటర్స్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, ఐఈఆర్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, రిసోర్సు పర్సన్ల డివిజన్ అధ్యక్షుడు నాగన్న, కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, జిల్లాలోని సమగ్ర శిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆట పాటలతో అంగన్‌వాడీల నిరసన

అమలాపురం టౌన్, డిసెంబరు 31: సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండు చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 20వ రోజుకు చేరుకుంది. అమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట జగన్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ అంగన్‌వాడీలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తూ పాటలు పాడారు. కబడ్డీ ఆడారు. దీక్షా శిబిరానికి నాయకత్వం వహిస్తున్న జిల్లా కోశాధికారి పి.అమూల్య, ప్రాజెక్టుఅధ్యక్ష, కార్యదర్శులు కె.బేబిగంగారత్నం, విజయ, దైవకృపల ఆధ్వర్యంలో వందలాది మంది అంగన్‌వాడీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో గడిపారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కనీస వేతనాలు చెల్లించాలని నినాదాలు చేశారు. దీక్షా శిబిరంలో వి.నవోమి, రుక్మిణి, ఎం.శమంతకమణి, రత్నకుమారి, మణిమాల, ఉమామహేశ్వరి, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

ముమ్మిడివరం: అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరుకుంది. ముమ్మిడివరంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. ఆదివారం ఆట పాటలాది నిరసన తెలిపారు. రోడ్డుపై క్రికెట్, కబడ్డీ వంటి ఆటలుఆడి నిరసన తెలిపారు. పండుగపూట అక్కాచెల్లెళ్లను ఉసురు పెడుతున్నారని, తమ ఉసురు ఊరికేపోదని వారు నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్.దుర్గామహేశ్వరి, ఎం.జయలక్ష్మి, ఎస్.కనకదుర్గ, టి.శ్రీదేవి, జి.అనంతలక్ష్మి, సుబ్బలక్ష్మి, విజయ్, జి.లత, ఎం.అరుణ, శైలజ, సుభాషిణి, ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మండపేట: అంగన్‌వాడీల సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ప్రభుత్వం అందించిన సెల్‌ఫోన్, చీరలు తమకు వద్దని, తమ డిమాండ్లు తీర్చాలంటూ సీఎం జగన్, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి ఉషాచరణ్, ఇతర మంత్రులు పేరిట మంత్రాలు చదువుతూ సెల్‌ఫోన్, చీరలను ముందువేసుకుని పూజలు చేసి నిరసన తెలిపారు. మండపేటలో ఆదివారం అంగన్‌వాడీలు పిల్లలతో దీక్షలో పాల్గొన్నారు.

పి.గన్నవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారంఅంగన్‌వాడీలు నిరసన తెలిపారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకుల అధ్యక్షులు బండి వెంకటలక్ష్మీ, కె.నాగలక్ష్మి, లక్ష్మీకుమారి, కె.కిరణ్మయి, జి.వెంకట రమణ, జె.పద్మమాల, డి.లలిత, కె.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ సదస్సుకు తరలిరండి



కాట్రేనికోన, డిసెంబరు 31: జనవరి 3న విజయవాడలో జరిగే పంచాయతీ రాజ్ రాష్ట్ర సదస్సుకు సర్పంచ్‌లు తరలిరావాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య ప్రధాన కార్యదర్శి రంబాల రమేష్ విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగే సదస్సులో పంచాయతీలు, ఇతర స్థానిక సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ జరుగుతుందన్నారు. మాజీ సీఎం చంద్రబాబును ఈసదస్సుకు ఆహ్వానించామన్నారు. పంచాయతీల నిధులు దారి మళ్లింపు తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు.

రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీల్లో గుమ్మిలేరుకు బహుమతులు



ఆలమూరు, డిసెంబరు 31: పశుపోషణలో ఉభయతెలుగు రాష్ట్రాల్లో మంచి గుర్తింపు పొందిన ఆలమూరు మండలం గుమ్మిలేరుకు ఎడ్ల పరుగు పోటీల్లో స్థాయి బహుమతులు సాధించారు. తూర్పుగోదావరి జిల్లా వడిసిలేరులో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగుల పదర్శన పోటీల్లో గుమ్మిలేరుకు చెందిన కోరా వీరభద్రరావు ఎడ్లు సీనియర్స్ విభాగంలో రాష్ట్రస్థాయి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. బహుమతులను రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కోరా వీరభద్రరావుకు అందించారు. మొదటి బహుమతికి బుల్లెట్ బైక్, ద్వితీయ బహుమతిగా ఎలక్ట్రికల్ స్కూటర్‌ను అందజేశారు. వీరభద్రరావును ఆలమూరుకు చెందిన పలువురు నాయకులు అభినందించారు.

స్టడీమెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట, డిసెంబరు 31: శ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందిస్తున్న గ్రూప్-1, 2 ఉచిత స్టడీమెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ చైర్మన్ మోకా రమాదేవి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ట్రస్ట్ ఆధ్వర్యంలో నమూనా పరీక్ష నిర్వహించారు. ఈపరీక్షకు 400మంది హాజరుకాగా మొదటి మార్కులు సాధించిన 100మందికి ఉచిత కూపన్లు అందించారు. షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘ అధ్యక్షుడు నందిక వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మోకా రమాదేవి మాట్లాడారు. జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, కొర్లపాటి కోటబాబు, జిల్లాసంక్షేమ కార్యదర్శి గోసంగి బంగర్రాజు, గెడ్డంప్రదీప్, గూటం సాయి, పరమట నాని, వెన్నపు సత్యనారాయణ, కోట విజయరాజు పాల్గొన్నారు.

'యువతను మోసం చేసిన జగన్'

కొత్తపేట, డిసెంబరు 31: యువతకు 2.30లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామని వైసీపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వారి జీవితాలతో ఆటలాడుకునే విధంగా మోసం చేశారని బీజేపీ యువమోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్‌నారాయణ అన్నారు. ఆదివారం ఆయన కొత్తపేటలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు ఉద్యోగాల విప్లవం అని వాగ్దానాలు చేసిన జగన్ నిరుద్యోగులను నిలువునా ముంచాడన్నారు. సొంత మనుషులను సలహాదారులుగా నియమించుకుని లక్షలాది రూపాయలు ప్రజాధనాన్ని వారికి ధరాదత్తం చేశారన్నారు. వేలాదిగా ఖాళీగా డీఎస్సీపోస్టులను నాలుగున్నరేళ్లలో భర్తీ ఆలోచనే చేయలేదన్నారు. 2024 జనవరిలో వైసీపీ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోతే నిరుద్యోగ యువతకు మద్దతుగా యువమోర్చ ఉద్యమం చేస్తుందన్నారు.